నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 25 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

భూ అక్రమార్కులకు అండదండలు

- హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి నాలా చేసిన గత తహసీల్దార్
- వాటిని రద్దు చేసి, ఆ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ సీసీఎల్‌ఏ ఆదేశాలు
- అనేక పోరాటాల అనంతరం ఎట్టకేలకు ఆర్డర్ ఇచ్చిన గత కలెక్టర్
- ధరణి అధికారాలు తహసీల్దార్‌లకు బదలాయించడంతో మారిన సీన్
- ఫిర్యాదు పేరు చెప్పి కోర్టు తీర్పును, సీసీఎల్‌ఏ ఆదేశాలను, గత కలెక్టర్ ఆర్డర్‌లనే పక్కన పెట్టిన కొత్త తహసీల్దార్
- ప్రస్తుత కలెక్టర్‌ను కలిసేందుకు బాధితుల యత్నం
- గత కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌తో నాకు సంబంధం లేదంటున్న కొత్త కలెక్టర్
- పట్టించుకోకపోవడంతో 'నమస్తే తెలంగాణ'కు ఆశ్రయించిన వైనం

తనకు జరిగిన అన్యాయాన్ని 'నమస్తే తెలంగాణ'కు చెప్పుకుంటున్న బాధితుడు

మంచిర్యాల, జూలై 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ధరణిలో పెండింగ్ దరఖాస్తులు పేరుకుపోయాయి. గత కేసీఆర్ సర్కారు ధరణిలో మార్పులు చేసే అధికారాలన్నీ కలెక్టర్లకు ఇవ్వడంతో ఇవి పరిష్కారం కాలేదు. అందుకే దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారాలను తహసీల్దార్లు, ఆర్డీవోలకు ఇస్తున్నామని చెప్పి కాంగ్రెస్ సర్కారు.. అధికారాలన్నీ తహసీల్దార్లకు బదలాయించింది. మార్చిలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామంటూ చెప్పుకొచ్చింది. రైతు భూమిని అమ్ముకోవాలన్నా.. కొనాలన్నా ఆ రైతు వచ్చి బయోమెట్రిక్(వేలిముద్ర) పెడితినే అది సాధ్యం అవ్వాలి అనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కార్ తీసుకొచ్చిన ధరణిపై ఎన్నో విమర్శలు చేసింది. కొత్త విధానమంటూ ప్రకటనలు చేసింది. దానికి ముందు సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లకు అధికారాలను కట్టబెడుతూ వెబ్‌సైట్‌లోని మాడ్యూల్స్‌ను మార్చింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలనే తీవ్రమైన పని ఒత్తిడితో కొందరు తహసీల్దార్లు ఏ చిన్న కారణం దొరికినా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. పరిష్కరిస్తున్న అప్లికేషన్ల కంటే తిరస్కరిస్తున్నవే ఎక్కువ ఉంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా.. తహసీల్దార్లకు అధికారాలు బదలాయించడంతో గతంలో కోర్టు కేసుల్లో కొట్లాడి, అనేక ఆటుపోట్లను ఎదుర్కొని సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి వచ్చిన దశలోనూ కొందరి అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతున్నాయి. భూ కబ్జాదారులకు అండగా నిలుస్తున్న కొందరు తహసీల్దార్లు గతంలో కోర్టులు ఇచ్చిన ఆదేశాలు, గత అధికారులు ఇచ్చిన ఆర్డర్లను తుంగలో తొక్కేస్తున్నారు. ఇలాంటి ఘటనే మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో వెలుగులోకి వచ్చింది. తమ భూమిని కబ్జా చేసిన ఇద్దరు అక్రమార్కులపై బాధితులు కోర్టులో కేసు గెలిచారు. అదయ్యాక కోర్టు తీర్పు ప్రకారం అక్రమ డాక్యుమెంట్లను రద్దు చేయాల్సిన తహసీల్దార్ కోర్టులో స్టే ఉండగానే అదే అక్రమార్కులు చెప్పిన వారి పేరు మీదకు నాలా కన్వర్షన్ చేశాడు. బాధితులు దానిని సవాల్ చేయడంతో సీసీఎల్‌ఏ స్పందించి సదరు తహసీల్దార్‌పై చర్యలు తీసుకుని, నాలా కన్వర్షన్‌ను రద్దు చేయాలని బాధితులను న్యాయం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు గతంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా పని చేసిన బదావత్ సంతోష్ ఆర్డర్ కూడా ఇచ్చారు. ఈ టైమ్‌లోనే ధరణి అధికారాలకు కలెక్టర్ల నుంచి తహసీల్దార్లకు వెళ్లాయి. దీంతో కొత్తగా వచ్చిన మరో తహసీల్దార్ గత కోర్టు తీర్పును, సీసీఎల్‌ఏ ఆదేశాలను, కలెక్టర్ ఆర్డర్‌ను లెక్క చేయకుండా.. మరోసారి అక్రమార్కులకు అండగా తన లాగిన్‌లోకి వచ్చిన దరఖాస్తును తిరస్కరించాడు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చిందని బాధితులు తలలు పట్టుకుంటున్నారు. ప్రజావాణిలో విషయాన్ని కొత్తగా వచ్చిన కలెక్టర్‌కు చెప్పుకుందామంటే ఆయన వినేందుకు ఆసక్తి చూపించడం లేదని వాపోతున్నారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని కోరుతూ 'నమస్తే తెలంగాణ'ను ఆశ్రయించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా..

అక్రమ పట్టాను రద్దు చేయమన్న కోర్టు..

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని సర్వే నంబర్ 996 సబ్ నంబర్‌లోని 2.22 ఎకరాల భూమిని ఏ.కమలాబాయ్, ఆర్.తారాబాయ్ ఇద్దరు అక్కాచెల్లెళ్లు 1972 సంవత్సరంలో కొనుగోలు చేశారు. వీళ్ల బంధువులైన బానాల లక్ష్మీనారాయణ, రేవెల్లి రాజన్న ఆ భూమిని అక్రమంగా వాళ్ల పేరు మీదకు 2007లో పట్టా చేయించుకున్నారు. దీనిపై కమలాబాయ్ కొడుకు సత్యనారాయణ, మరో పట్టాదారు ఆర్.తారాబాయి ఈ ఇద్దరు వ్యక్తులు మా భూమిని కొట్టేసి, దొంగ పట్టా చేయించుకున్నారని కేసు వేశారు. హైకోర్టు ఆదేశాలతో మంచిర్యాల జిల్లా ట్రిబ్యునల్ సాక్ష్యాధారాలను పరిశీలించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకొని లక్ష్మీనారాయణ, రాజన్నలకు(ఆర్‌వోఆర్ ప్రొసిడింగ్ నెంబర్: 41/2007)తో తేదీ 31.05.2007లో చెన్నూర్ తహసీల్దార్ జారీ చేసిన మ్యూటేషన్ ఆర్డర్‌ను రద్దు చేసి, జాయింట్ పట్టాదారులైన కమలాబాయ్, తారాబాయ్‌ల పేరు మీదకు రీస్టోర్ చేయమని ఆదేశాలు ఇచ్చింది. బాధితులు కోర్టులో కేసు గెలిచాక అపోనెంట్ పార్టీ హైకోర్టు నుంచి ఆరు వారాలకు స్టేటస్ కో తెచ్చుకున్నారు. చెన్నూర్ తహసీల్దార్ రికార్డుల్లో ఎంట్రీలు చేయడానికి ముందు ఆరు వారాలు స్టేటస్‌కో మెయింటేన్ చేయాలంటూ కోర్టు జూన్ 14, 2022లో స్టే ఇచ్చింది. కాగా.. ఈ స్టే ఉండగానే అప్పటి చెన్నూర్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే కోర్టు ఆరు వారాల స్టే ఉన్న పీరియడ్‌లోనే జూలై 6, 2022లో మరో నలుగురు నూక శంకర్, జెడల సతీశ్, కోమటిపెల్లి రమేశ్ మరొకరి పేర్ల మీదకు నాలా కన్వర్షన్ చేశారు. దీనిపై బాధితులు కంటెంట్ ఆఫ్ కోర్టు వేయకుండా తహసీల్దార్ అక్రమార్కుల దగ్గర డబ్బులు తీసుకుని నాలా కన్వర్షన్ చేశారంటూ ఏసీబీ(అవినీతి నిరోధక శాఖ)కు ఫిర్యాదు చేశారు. ఏసీబీ నుంచి సీసీఎల్‌ఏకు ఫిర్యాదు వెళ్లడంతో స్పందించిన సీసీఎల్‌ఏ దీనిపై పూర్తి విచారణ చేయాలంటూ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

తప్పు జరిగిందని తేల్చేసిన ఆర్డీవో రిపోర్ట్

సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు అప్పటి కలెక్టర్ మంచిర్యాల ఆర్డీవోను ఎంక్వైరీ అధికారిగా నియమించారు. విచారణ చేసిన అనంతరం ఆర్డీవో చెన్నూర్ తహసీల్దార్ చేసిన నాలా కన్వర్షన్ పూర్తిగా ఇల్లీగల్ అని, చట్టపరమైన నిబంధనలు పాటించకుండా, కోర్టు ఆదేశాలు, స్టేకు వ్యతిరేకంగా నాలా కన్వర్షన్ చేశారని గుర్తించారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి, తగిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. దీనిపై కలెక్టర్ సీసీఎల్‌ఏకు నాలా కన్వర్షన్‌లో తప్పు జరిగింది. రివోక్ చేసేందుకు అనుమతులు ఇవ్వాలంటూ లేఖ రాశారు. ఇక్కడి దాకా వచ్చినా ప్రాసెస్ కొన్ని రోజులు ఆగిపోయింది. దీంతో ఆర్డీవో ఎంక్వైరీ చేసిన లెటర్, కలెక్టర్ సీసీఎల్‌ఏకు రాసిన లెటర్‌లను ఆధారంగా చేసుకుని బాధితులు కోర్టు ధిక్కరణ (కంటెంట్ ఆఫ్ కోర్టు) కేసు వేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న సీసీఎల్‌ఏ కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా రెవెన్యూ రికార్డులను మార్చిన చెన్నూర్ తహసీల్దార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై పూర్తిస్తాయి రిపోర్ట్ సడ్మిట్ చేసి కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని కలెక్టర్‌ను పేర్కొంది. ఈ మేరకు కలెక్టర్ స్టేటస్ కో ఉన్నప్పుడు మీరు నాలా కన్వర్షన్ చేసుకున్నారు. ఇది చెల్లదు ధరణిలో దాన్ని తొలగించేందుకు మీరు వచ్చి వేలిముద్రలు వేయాలంటూ అపోజిట్ పార్టీకి చెప్పారు. వారు రాకపోవడంతో బయోమెట్రిక్ లేకుండా ధరణిలో ఈ ట్రాన్సక్షన్‌ను క్యాన్సల్ చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ సీసీఎల్‌ఏను కోరారు.

ఎట్టకేలకు ఆర్డర్ ఇచ్చిన గత కలెక్టర్

సీసీఎల్‌ఏ అనుమతి ఇవ్వడంతో ధరణిలో అక్రమంగా జరిగిన ఈ నాలా కన్వర్షన్‌ను రద్దు చేసేందుకు కలెక్టర్ మాన్యువల్ ఆర్డర్ ఇచ్చారు. ఆ ఆర్డర్‌ను ధరణిలో అప్‌లోడ్ చేసి కలెక్టర్ వేలిముద్ర పెడితే పనైపోతుంది. కోర్టు ఆదేశాల మేరకు మా భూమి మాకు దక్కుతుందని బాధితులు సంబురపడ్డారు. సరిగ్గా ఈ సమయంలోనే ధరణి వెబ్‌సైట్‌లో మాడ్యూల్స్ ఛేంజ్ అయ్యాయి. తహసీల్దార్లకు అధికారాలు బదలాయించ బడ్డాయి. ఏ అప్లికేషన్ అయినా తహసీల్దార్ నుంచి రావాలనే నిబంధనతో అన్నింటితోపాటు ఈ దరఖాస్తు కూడా తహసీల్దార్ లాగ్ ఇన్‌లోకి వెళ్లింది. ఇక్కడే అసలు కథ మొదలైంది. కొత్తగా వచ్చిన తహసీల్దార్ మల్లికార్జున్ దగ్గరికి బాధితులు ఈ డాక్యుమెంట్లు అన్నీ తీసుకెళ్లి ఇచ్చారు. జరిగిన స్టోరీ కోర్టు కేసు, సీసీఎల్‌ఏ ఆదేశాలు, కలెక్టర్ ఆర్డర్ అన్ని సడ్మిట్ చేశారు. దానికి తహసీల్దార్ చూసి చేస్తామని చెప్పారు. ఇంత కష్టపడ్డాం కచ్చితంగా పనైపోతుంది అనుకున్నారు. కానీ.. తహసీల్దార్ కలెక్టర్ ఆర్డర్‌ను, సీసీఎల్‌ఏ డైరెక్షన్, కోర్టు తీర్పును పరిగణలోకి తీసుకోలేదు. పట్టాదారులుగా మేం లేకుండా గుర్తుతెలియని వ్యక్తులు ధరణిలో నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేశారంటూ అక్రమార్కులు ఇచ్చిన ఫిర్యాదే.. వీటన్నింటికంటే ఆయనకు ఎక్కువైపోయింది. పట్టాదారులు దరఖాస్తు చేసుకున్నందున ఈ అప్లికేషన్‌ను మేము క్యాన్సల్ చేస్తున్నామని చెప్పి క్యాన్సల్ చేశారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. కలెక్టరేట్ నుంచి ఇంత క్లీయర్‌గా బయోమెట్రిక్‌కు మినహాయింపు ఇవ్వాలని లెటర్ ఉన్నప్పటికీ.. దాన్ని పక్కదోవ పట్టిస్తూ బయోమెట్రిక్ పట్టాదారు పెట్టలేదని ఫిర్యాదుతో తహసీల్దార్ దరఖాస్తు రిజక్ట్ చేశారని.. తమ కష్టం చెప్పుకునేందుకు బాధితులు కొత్త కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చారు.

సమస్య వినేందుకు విసిగించుకున్నరు..

సోమవారం ప్రజావాణిలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి సార్ గత కలెక్టర్ బాదావత్ సంతోష్ ఇలా ఆర్డర్ ఇచ్చారని, విషయం చెప్పే ప్రయత్నం చేశారు బాధితులు. దానికి కలెక్టర్ ఆ కలెక్టర్ ఇచ్చిన దానికి నాకు సంబంధం లేదు. పట్టాదారులు దరఖాస్తు చేయలేదని చెప్పారు. మా రూల్స్ ప్రకారం మేం దాన్ని రిజెక్ట్ చేశామంటూ కలెక్టర్ సమాధానం చెప్పారని బాధితులు చెప్పారు. ఆ ట్రాన్సక్షన్ ఎలా జరిగింది.. కోర్టులో కేసు ఏంటి.. సీసీఎల్‌ఏ ఏం చెప్పింది. పట్టాదారు బయోమెట్రిక్ ఇవ్వకుండా ఒక అప్లికేషన్ అప్‌లోడ్ ఈ స్టేజ్ వరకు వచ్చి గత కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారంటే దాని వెనుక ఏం జరిగిందనేది ఒకసారి మీ సెక్షన్ వాళ్లను అడగండంటూ కలెక్టర్‌ను రిక్వెస్ట్ చేసినట్లు బాధితులు చెప్పున్నారు. దీనికి కలెక్టర్‌ను నుంచి సరైన స్పందన రాలేదని పాత కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను కొత్తగా వచ్చిన కలెక్టర్ సంబంధం లేదంటే ఎలా అంటూ బాధితులు వాపోతున్నారు. ప్రజాపాలన అంటే ఇదేనా అంటూ మండిపడుతున్నారు. కోర్టు ధిక్కరణ కేసు వేసినప్పుడు జడ్జి.. రికార్డుల్లో మేము మారుస్తున్నాం, రివోక్ చేస్తున్నామని డీటీ, తహసీల్దార్ కోర్టులో అఫిడవిట్ సడ్మిట్ చేశారు. మీకు శిక్ష కావాలా? లేక పని కావాలా? అని అడిగారు. పనైతే చాలు, శిక్ష వేయించడం మా ఇంటెక్షన్ కాదు అని చెప్పడంతో కోర్టులో కేసును డిస్పోజ్ చేశారు. అదయ్యాక కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారు. అంతా అయిపోయింది. ఈ సమయంలో కేవలం ధరణి అధికారాలను తహసీల్దార్‌లకు ఇవ్వడంతోనే తాము నష్టపోయామంటూ బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మరి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని కోర్టు తీర్పులను, సీసీఎల్‌ఏ డైరెక్షన్స్‌ను, కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసిన తహసీల్దార్‌లపై చర్యలు తీసుకుంటుందా లేదా వేచి చూడాలి.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీవో

వంట చేసే సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

రెబ్బెన, జూలై 24 : గోలేటి గ్రామంలోని ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలను బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాలలు, రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కిటికీలు ఊడిపోయాయని, తరగతి గదుల స్లాబ్‌లు, వంట రూమ్ ఉరుస్తున్నదని పీవో దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో మరమ్మతులు చేయిస్తామని ఆమె తెలిపారు. పీవో వెంట హెచ్ఎం సోమయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ సార్..



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ నాయకులు

నస్పూర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యువనేత కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం పండుగలా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు భారీ కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. నిరుపేదలకు అన్నదానంతో పాటు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదానాలు చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. నిండూ నూరేళ్లు వర్ధిల్లాలని దీవించారు. హైదరాబాద్‌లో రామన్నకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మంచిర్యాలలోని నస్పూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కార్యకర్తలు, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.

- నేడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న మంత్రి భట్టి విక్రమార్క
- జిల్లాలో వరద విపత్తు నిర్వహణకు ప్రత్యేక కేటాయింపులు
- చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్, రెవెన్యూ డివిజన్‌పై ఆశలు
- పడ్తనపల్లి ఎత్తిపోతల పథకంపై ముందుకు కదిలేనా..
- ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఏర్పాటుపై చొరవ చూపేనా..
- ఆగిన పలు అభివృద్ధి పనులకు నిధులపై జిల్లావాసుల ఆశలు

బడ్జెట్‌పై ఆశలు

మంచిర్యాల, జూలై 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు ఒక్కపైసా కూడా విదిల్చలేదు. కాగా.. నేడు(గురువారం) రేవంత్‌రెడ్డి సర్కారు ప్రకటించే రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లావ్యాప్తంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తూ నిధులు ఉండాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

● గోదావరి వరదతో ముంపునకు గురయ్యే కోటపల్లి మండలంలోని గ్రామాలుసహా మంచిర్యాల జిల్లా కేంద్రానికి వరద ముంపు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తారనే చర్చ నడుస్తున్నది.

● గోదావరి కరకట్ట నిర్మాణంపై ప్రకటన ఉంటుందని ఆశిస్తున్నారు. గోదావరి మీదుగా మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి పనులను అర్ధాంతరంగా ఆపేసి, ముల్కల్ల నుంచి మురుమూర్‌కు బ్రిడ్జి వేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో నిధులు సాధించుకొస్తారని అంతా భావిస్తున్నారు.

● అన్ని మండల కేంద్రాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నారు.

బీఆర్ఎస్ సర్కారు హయాంలో శంకుస్థాపన చేసుకున్న చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్, పడ్తనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, గూడెం లిఫ్ట్ పనులకు నిధులు కేటాయిస్తారా లేదా అన్నది ఆసక్తిగా మారింది.

● బీఆర్ఎస్ సర్కారు చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌సహా పారుపల్లి మండలాన్ని ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చింది. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక అది మరుగున పడింది. దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

● మందమర్రిలో ఆయిల్ పాం ఫ్యాక్టరీకి గత ప్రభుత్వం భూమి పూజ చేసింది. కొన్ని కారణాలతో ఫ్యాక్టరీ ఉంటుందా? లేదా? అన్న విషయంలో స్పష్టత లేకుండా పోయింది. దీంతో వేల ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేసిన రైతులు ఫ్యాక్టరీపై ఈ బడ్జెట్‌లో స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు.

● బెల్లంపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, ఐటీ హబ్ వంటి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. నిధులు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నారు.

● అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేడెట్ మార్కెట్ల పనులు సగంలోనే ఆగిపోయాయి. మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారుల్లో బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కార్ పెద్దపీట వేసింది. జిల్లాలో 30 నుంచి 40 బ్రిడ్జిలు నిర్మించి అనేక గ్రామాలకు రాకపోకలను మెరుగుపరిచింది. ఇంకా కొన్ని మిగిలిపోయి ఉన్నాయి. నిధుల కేటాయింపులు చేస్తే బాగుంటుందని జనం భావిస్తున్నారు.

నాయకులపై గంపెడాశలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఇందులో నాలుగింటిని కాంగ్రెస్ గెలిస్తే.. ఇందులో మూడు స్థానాలు మంచిర్యాల జిల్లాలోనే ఉన్నాయి. పైగా ప్రేమ్‌సాగర్‌రావు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు అత్యంత ఆప్తుడని అందరికీ తెలిసిందే. మరోవైపు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌లు తమ సీనియార్టీ, సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న పరిచయాలతో పెద్ద ఎత్తున నిధులు తెస్తారని జనం గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోపరిస్థితుల్లో రాష్ట్ర బడ్జెట్ మంచిర్యాల జిల్లావాసులకు కీలకంగా మారింది. మరి జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు నిధులు కేటాయింపులు ఉంటాయా? లేదా? అన్నది గురువారం తేలిపోతుంది.

మంచిర్యాలలో నీట మునిగిన ఇండ్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాసులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై జిల్లా ప్రజానీకం ఆశగా ఎదురుచూస్తున్నది. అనేక సమస్యలు పట్టిపీడిస్తుండగా, సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు చర్యలు తీసుకుంటుందేమోనన్న ఆతృతలో ఉన్నారు. జిల్లా మొత్తంగా 40కి పైగా వాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. అర్ధాంతరంగా నిలిచిపోయిన గుండి వంతెనను నిర్మించేందుకు రీఎస్టిమేట్ చేసినప్పటికీ నిధులు లేక పనులు ప్రారంభం కాలేదు. లక్ష్మీపూర్, తుంపెల్లి, అనార్‌పల్లి వంతెనల ప్రతిపాదనలు చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. బ్రిడ్జిలు లేకపోవడంతో వానకాలంలో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడ్డప్పుడల్లా బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయి అష్టకష్టాలు పడుతున్నారు.

దెబ్బతిన్న కుమ్రం భీం ప్రాజెక్టు కట్టపై కప్పిన కవర్

అలాగే రోడ్లు అధ్వానంగా మారి ప్రయాణం నరక ప్రాయంగా మారింది. దాదాపు 140కి పైగా గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన కుమ్రం భీం ప్రాజెక్టు కట్టకు బీటలు వారుతున్నాయి. 10 టీఎంసీల సామర్థ్యంతో దాదాపు రూ. 800 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 45 వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉండగా, కట్టకు బీటలు వస్తుండడంతో 5 టీఎంసీలకు నీటి సామర్థ్యానికే పరిమితం చేశారు. పగుళ్లు తేలుతున్న కట్టపై కవర్లు కప్పి అధికారులు కవర్‌చేస్తున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలతో పాటు మానవ సంబంధాలను మెరుగుపరిచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా వార్ధా వంతెన నిర్మాణం కోసం రూ. 75 కోటుల మంజూరు చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వంతెన నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదు. ప్రాణహితపై బారాజ్ నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి చూపగా, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయిస్తుందో లేదోనని ప్రజల సందేహిస్తున్నారు.

వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఒకరికి తీవ్రగాయాలు

మంచిర్యాల, జూలై 24, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కోటపల్లి మండలం ఎర్రాయిపేట గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎర్రాయిపేట సమీపంలోని అడవిలో వేటగాళ్లు వారం క్రితం విద్యుత్ తీగ ద్వారా వన్యప్రాణులను వేటాడినట్లు సమాచారం. విద్యుత్ తీగకు తగిలి వన్యప్రాణులు మరణించగా, వాటిని తరలించే హడావుడిలో విద్యుత్ తీగను తొలగించలేదని తెలిసింది. ఈ క్రమంలో పుట్ట గొడుకుల కోసం అటువైపు వెళ్లిన రాజబాబుకి విద్యుత్ తీగ తగలగా, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. కాగా, అటవీ అధికారులు ప్రమాదానికి కారణమైన వేటగాళ్లపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పీకలగుండానికి మిషన్ భగీరథ నీరు

మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న మహిళ

దహెగాం, జూలై 24 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం చంద్రపల్లి పంచాయతీ పరిధిలోని పీకలగుండం గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాక మహిళలు అవస్థలు పడుతున్నారని, ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఎర్రవాగును దాటి, చెలిమెల నీరు తెచ్చుకుంటున్నారని.. ఈ నెల 23న 'నమస్తే తెలంగాణ' మెయిన్ మొదటి పేజీలో 'భగీరథ ప్రయత్నం' పేరిట శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించారు. మంగళవారం వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయగా, బుధవారం మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసి నల్లాల ద్వారా నీరు సరఫరా చేశారు. రక్షిత మంచినీటి పథకం కోసం కొత్త విద్యుత్ మోటర్ తీసుకొచ్చినట్లు జేఈ ఇనోస్ తెలిపారు. కాగా, నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'నమస్తే తెలంగాణ'కు అభినందనలు తెలిపారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679
● జన్మదిన శుభాకాంక్షలు
● పొలిటికల్
● స్వదేశాగమనం
● లీగల్ ప్రకటనలు
● క్లాసిఫైడ్స్
● పదవీ విరమణ
● ప్రారంభోత్సవం
● శ్రద్ధాంజలి
● సినిమా
● వివాహ మహోత్సవం
● షష్టిపూ